# 25. వీరభోజ్యం

బ్రిటిష్‌వారు ప్రపంచ ప్రసిద్ధినందిన ప్రజాస్వామ్యవాదులు. కనుక భారతదేశంలోని సంస్థానాలను భోంచేసి, మహారాజులను రాజ్యభ్రష్టులను చేయటం కూడా అత్యంత ప్రజాస్వామ్య పద్ధతుల్లో శాస్త్రోక్తంగా నిర్వహిస్తుండే వారు

బ్రిటిష్ వారికి అత్యంత ప్రేమ పాత్రుడు ఉత్తర భారతంలో పెద్ద సంస్థానమైన పాటియాలా మహారాజా భూపేంద్ర సింహజీవారు. శ్రీవారు సుప్రశిద్ధులైన శృంగార పురుషులు. వారి అంతఃపురంలో రాణులూ, మహారాణులూ గాక వందలాది కన్యలుండేవారు. శ్రీవారు వారిని రుచి చూసినా చూడకున్నా కనపడిన అందగత్తెనల్లా అంతంపురంలోకి ఏదో విధంగా చేరవేయిస్తుండేవారు. అది వారి హాబీ.

ఆ పొరుగునే ఉన్న 'నభా' సంస్థానాధీశుడు హిజ్‌హైనెస్ వగైరా బిరుదాంకితులైన మహారాజా రూపదమన్ సింహజీవారు కూడా బ్రిటిష్ వారికి ఇష్టులే. అయితే బ్రిటిష్ వారికి అందరూ ఇష్టులేగానీ వారి సంస్థానాలు మాత్రం మరింత ఇష్టమైనవి.

పాటియాలా మహారాజా భూపేంద్ర సింహజీవారు ఓసారి సరిహద్దులలో వేటకు సపరివారంగా వేంచేసేరు. అక్కడ శ్రీవారొక చిరుత పులిని వేటాడుతూ వెంటబడి అనుకోకుండానే "నభా" సంస్థానంలో అడుగుపెట్టేరు. వెంటాడి, వెంటాడి మొత్తం మీద సదరు చిరుతపులిని మట్టుపెట్టేరు. మహోత్సాహంతో తాత్కాలికంగా అక్కడ విడిదిచేసేరు.

మహాఘనత ఏహించిన మహారాజా వారినీ, వారు వేటాడిన అపు రూపమైన చిరుతపులినీ దర్శించుకునేందుకు చుట్టు ప్రక్కల గ్రామాల నుండి ప్రజలు తండోపతండాలుగా విరగబడి వచ్చేరు.

ఆ వచ్చిన జనసమూహంలో మహారాజావారి దృష్టిని ఆ కట్టు కున్న ఓ యువతి పేరు రజని !

రజని పదిహేడేళ్ళ పసిడి శలాక. సామాన్య రైతు దంపతుల బిడ్డ. కళాకారుడు స్వయంగా చిత్రించి ప్రాణం పోశాడనుపింపచేసే అందం ఆమెది. ఆవిడ కనుముక్కు తీరులు అపురూపమైనవి. బంగారు వర్ణంలో ఆవిడ కేశ సంపద మెరిసిపోతుండేది. ఆవిడకున్న నీలికళ్ళు అందానికి ఆదనపు అలంకారం. పంజాబీ స్త్రీలలో నీలికళ్ళు గలవారు బహు అరుదు.

అలాంటి రజనిని చూసి మహారాజా భూపేంద్ర సింహజీవారు ముగ్ధులై మోహించేరు, ఆశ్రితుల ద్వారా రజని తలిదండ్రులకు కబురు పంపేరు.

కానీ, రజని ఆమె తలిదండ్రులూ మహారాజావారి ఆహ్వా నాన్ని తిరస్కరించేరు. "కూటికి పేదలమైతే..." పాటను శోకంగా వారిలో వారే గానం చేసుకున్నారు.

రాజుగారు తలచుకుంటే దెబ్బలకు కొదువా ! మహారాజా వారు కావాలనుకున్నాక కానిదేముంటుంది ?

కనుక,

ఓ శుభముహూర్తాన మహారాజా భూపేంద్ర సింహజీవారి అంత రంగికులయిన కొందరు సేనానులు రజనిని ఆమె ఇంటి నుండి రహ స్యంగా, బలవంతంగా మాయంచేసేరు.

చేసి, పాటియాలాలోని మహారాజా వారి దివ్య హర్మ్యంలో ఉంపుడుకత్తెల మందిరంలోకి విసరి వేసేరు. తప్పని సరిగా రజని అక్కడి వందలాది మందిలో కలసిపోయింది.

ఈ సంగతి తెలిసిన నభా సంస్థానాధీశుడు రూపదమన్ సింహజీ వారు మహోగ్రులయ్యేరు. పాటియాలా మహారాజావారు తన మహారాణినే ఎత్తుకపోయినట్లు శ్రీవారు విలవిలలాడి పోయేరు సంస్థానంలోని ప్రతి ఆడదీ తమకోసమే పుట్టిందనుకునే సంస్థానాధీశుల రక్తంలో జీర్ణించుకు పోయిన అలవాటు శ్రీవారి పౌరుషాన్ని రెచ్చగొట్టింది.

ఫలితంగా నభా సంస్థానాధీశుల సైనికులూ, మహారాజావారి ఆశ్రితులూ పాటియాలా సంస్థాన సరిహద్దుల్ని దాటి అక్కడి యువతులను ఎత్తుకుపోయి రూపదమన్ సింహజీ వారి ఉంపుడు కత్తెల విలాస మందిరంలోకి విసరివేయ నారంభించారు.

దీనితో అసలే నభా-పాటియాలా సంస్థానాధీశుల మధ్య రగులుతున్న అగ్నిలో ఆజ్యం పడి భగ్గుమనసాగింది.

ఆ విధంగా బ్రిటిష్‌వారి రొట్టె విరిగి నేతిలో పడింది. దొంగ నిద్ర నటిస్తున్న బ్రిటిష్ సింహం జూలు దులుపుకుంటూ లేచింది.

ఈ లోగా ఈ రెండు సంస్థానాల మధ్యా చిన్న చిన్న సంఘర్షణలు జరిగాయి. అవి ముదిరి సైన్యాలు సైతం కత్తులు దూసేయి. ఫలితంగా రక్తం వెల్లువలై పారింది.

ఈ రక్త పాతాల్ని ఆపేందుకు బ్రిటిష్ సైనికులు దిగారు. వైస్రాయ్ సలహామీద బ్రిటిష్ ప్రభుత్వం ఈ రెండు సంస్థానాధీశుల్లో ఎవరు దోషులు? మనం ముందు మ్రింగవలసింది ఏ సంస్థానాన్ని? అని విచారించేందుకు ఓ కమిటీని నియమించింది.

ఈ కమిటీ రజనిని ఎత్తుకుపోయి రాణీవాసంలో పడేసుకున్న పాటియాలా మహారాజా భూపేంద్రసింహజీవారు ఏ పాపం ఎరుగని నిర్దోషులని ఏకగ్రీవంగా తీర్పునిచ్చింది.

తత్ఫలితంగా బ్రిటిష్ సైన్యాలు నభా సంస్థానంలో శాస్త్రోక్తంగా, ప్రజాస్వామికంగా అడుగు పెట్టేయి. మహారాజా రూపదమన సింహజీ వారిని గద్దెదించి, భరణమిచ్చి, దక్షిణాదిన కొడైకెనాల్‌లో శాశ్వత నివాసానికి వీడ్కోలిచ్చి బలవంతంగా పంపివేసేయి.

అక్కడ...!

మహారాజావారు జీవితాంతం రాణీవాసంలో సకల భోగాలూ అనుభవిస్తూ సుఖించేరు.

ఇక్కడ...!

పదిహేడేళ్ళ పసిడి శలాక రజని మహరాజా భూపేంద్రసింహజీ వారి చేతుల్లో ఏడాదిలోగా ముసలిదయిపోయింది.

మధ్యలో...!

నభా సంస్థానంపై బ్రిటిష్ పతాకం గర్వంగా అత్యంత ప్రజాస్వామికంగా ఎగరసాగింది.

★